

తెలంగాణ భవన్‌లో ఆదివారం బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధన ఎలా? అన్న అంశంపై జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, జోగు రామన్న, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ ఎంపీ బడుగుల, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి, భిక్షమయ్య, అంజయ్యయాదవ్, చందర్, నరేందర్, జూలూరి, నేతలు బాలరాజ్, పల్లె రవి, తుల ఉమ తదితరులు

# రీసర్వే చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కులగణన సర్వేలో బీసీల జనాభాను దాదాపు ఐదున్నర శాతం తక్కువగా చూపించి బలహీనవర్గాల గొంతు కోయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తామనే హామీని కాంగ్రెస్ తొంగలో తొక్కిందని విమర్శించారు. దీనిపై శాసనసభ, మండలిలో బీఆర్ఎస్ నిరసన తెలిపిందని గుర్తుచేశారు. 'కులగణన తప్పుల తడక. చిత్తుకాగితంతో సమానం. బలహీనవర్గాల గొంతుకోసిన కాంగ్రెస్ పార్టీ దుర్మార్గ వైఖరిని ఏ బీసీ బిడ్డ కూడా ఒప్పుకోవడం లేదని అసెంబ్లీ ప్రభుత్వాన్ని గట్టిగా ఎండగట్టాం. మండలిలో మధుసూదనాచారి, అసెంబ్లీలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ నాయకత్వంలో బీఆర్ఎస్ సభ్యులు తమవాదన వినిపించారు. బీసీ జనాభాను తగ్గించి చూపెట్టి, బలహీనవర్గాలను తక్కువ చేసి చూపిస్తున్నారని నిరసన తెలిపాం' అని కేటీఆర్ వివరించారు.

### ఉల్టా చోర్ కొత్వాల్‌కో డాంటే అన్నట్టుగా..

బీసీలకు న్యాయం చేయడానికి వెంటనే రీ సర్వే చేయాలని కోరితే.. దున్నపోతు మీద వాన పడినట్టుగా రేవంత్ సర్కారు స్పందించడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే అన్నట్టుగా రేవంత్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను విమర్శిస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఒక్కరోజులోనే జరిపిన సమగ్ర కుటుంబ సర్వే మీదే అనుమానాలు లేవనెత్తేలా కాంగ్రెస్ నేత లు మాట్లాడుతూ బీసీలను అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను ఆహ్వానించి బీసీ డిక్లరేషన్ పేరిట కామారెడ్డి సభలో కాంగ్రెస్ హామీలిచ్చింది. స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని, వచ్చే ఐదేండ్లలో బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ పెడతామని, బీసీ సబ్‌ప్లాన్ తెస్తామని చెప్పింది. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, ప్రొక్యూర్‌మెంట్లలో 42% బీసీలకే ఇస్తామని చెప్పింది. అధికారం చేపట్టి 15 నెలలు అవుతున్నా 15 పైసలు కూడా బీసీలకు కేటాయించలేదు. కొత్తగా 16 కార్పొరేషన్లు బీసీ కులాలకు ఏర్పాటు చేస్తామని, ఒక్కో కార్పొరేషన్ రూ.50 కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి 50 పైసలు కూడా ఇవ్వలేదు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

### 22 లక్షల మంది బీసీల తగ్గింపు

తెలంగాణలోని బలహీనవర్గాల ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు ముఠా గోపాల్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించినట్టు కేటీఆర్ చెప్పారు. ఐదున్నర శాతం బీసీ జనాభా తగ్గించి దాదాపు 22 లక్షల మందిని లేనట్టుగా చిత్రీకరించిన దుర్మార్గానికి రేవంత్‌రెడ్డి పాల్పడ్డారని విమర్శించారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలను క్షమాపణ అడగాలని డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన అశాస్త్రీయం.. అసంబద్ధం. బీసీ సంఘాలు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీనే కులగణన సర్వేను చిత్తుకాగితంతో సమానమని కాలబెట్టిండు. మళ్లీ రీసర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నాం. సర్వే లెక్కలు తేల్చండి. సాకులు వెదకడానికి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వకుండా మేమంతా సర్వేకు సహకరిస్తాం. ఈసారి కులగణనలో మేమంతా పాల్గొంటాం. కోరిన వివరాలిస్తాం. రీసర్వేకు వెంటనే ఆదేశించాలి. బీసీలకు అన్యాయం చేయవద్దు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామన్న మాటను రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలి. దీనిపై మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు తీసుకొస్తారని భావించాం. కానీ బిల్లు తేలేదు సొల్లు మాత్రం చెప్పారు. బీఆర్ఎస్ మాత్రమే 50 శాతానికిపైగానే బీసీలకు పార్టీ పరంగా అసెంబ్లీ, పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇచ్చింది. అత్యధిక సీట్లు బీసీలకు కేటాయించింది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో 12 జనరల్ సీట్లకుగాను 6 స్థానాల్లో, అంటే 50 శాతానికిపైగా బీసీలకు టికెట్లు ఇచ్చింది. శాసనసభ ఎన్నికల్లో 34 సీట్లు బీసీలకు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మాట తప్పింది. కానీ, కేవలం 19 సీట్లే ఇచ్చారు. అందులో పాతబస్తీలో ఐదు సీట్లు ఉన్నాయి. చెప్పకుండానే బీఆర్ఎస్ బీసీలకు 34 సీట్లు ఇచ్చింది. మాకు ఎవరి సర్టిఫికెట్లు అవసరం లేదు. బీసీల ఆందోళన, ఆవేదనను అర్థం చేసుకున్నాం' అని కేటీఆర్ చెప్పారు.



తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ బీసీ నేతల సమావేశంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో ముచ్చటిస్తున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, గంగుల కమలాకర్

### పొలిమేరల దాకా తరిమికొట్టాలి: మధుసూదనాచారి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఊళ్లలోకి వచ్చే కాంగ్రెస్ నేతలను గ్రామ పొలిమేరల దాకా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. దేశాన్ని ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ బీసీల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి బీసీలు ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణింపబడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రెండోశ్రేణి పౌరులుగానే చద్దామా? మన పిల్లలకు ఇదే గతి పట్టాల్నా? అని ప్రశ్నించారు. అందరినీ ఏకం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ నాయకత్వంలోనే బీసీలకు 42% రిజర్వేషన్లు కూడా సాధిస్తామని చెప్పారు.

### అద్భుతంగా సమగ్ర కుటుంబ సర్వే

2015లో 25 లక్షల మంది ఎన్యూమరేటర్లతో ఇంటింటికి తిరిగి 30 గంటలలోపు అద్భుతంగా సమగ్ర కుటుంబ సర్వే (ఎస్కేఎస్) చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేని కేటీఆర్ గుర్తుచేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారని చెప్పారు. ఆ సర్వే లెక్కలు ఉన్నాయి కాబట్టే బీసీ సంక్షేమ పథకాలు పెద్ద మొత్తంలో అమలుచేశామని చెప్పారు. ఎస్కేఎస్‌లో హిందూ బీసీలు 51% ఉన్నట్టు తేలిందని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కారు జరిపిన కులసర్వేలో 46% అని చెప్తున్నారని, పదేండ్లలో బీసీల జనాభా తగ్గిందా? అని నిలదీశారు. నాడు 19 బీసీ గురుకుల పాఠశాలలు ఉంటే, వాటిని 327కు పెంచి మన పిల్లలకు చదువు చెప్పించే ప్రయత్నం చేశామని తెలిపారు. పూలే విద్యాలయాలు, ఉచితంగా గొర్రెలు, చేపపిల్లల పంపిణీ వంటి పథకాలు చేపట్టినట్టు గుర్తుచేశారు. పద్మశాలి సోదరులకు, చేనేతమిత్ర, బతుకమ్మ చీరలు వంటి అనేక ప్రోత్సాహక పథకాలు ప్రవేశపెట్టినట్టు తెలిపారు. చట్టసభల్లో ఇతర పార్టీల కంటే ఎక్కువ సీట్లను బీసీలకు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీయేనని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ చెప్పిన డాటా ప్రకారం.. బీసీలకు ఇంకా మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్కేఎస్‌తోపాటు బీఆర్ఎస్ బీసీ పాలసీ, పథకాల వివరాలను అందిస్తామని చెప్పారు. బీసీల కోసం బీఆర్ఎస్ చేపట్టిన కార్యక్రమాలను గల్లీ నుంచి ఢిల్లీ దాకా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అదే సందర్భంలో కాంగ్రెస్ డిక్లరేషన్లు, బీసీలకు ఇచ్చిన హామీలు, ప్రజావంచనపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. 30 మంది బీసీ నాయకులు తమిళనాడుకు వెళ్లి బీసీ రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్‌కు అందజేశారు.

> ఒకవేళ ప్రభుత్వం మొండి వైఖరితోనే ఉంటే, బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వకుండా వారి గొంతు కోసి స్థానిక సంస్థల ఎన్నికలకు పోతే, ఏం చేయాలన్న దానిపై విస్తృతంగా చర్చించాం. బీసీ నేతల అభిప్రాయాలను పార్టీ అధినేత కేసీఆర్‌కు నివేదించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం. బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాన్ని ఎండగడతం.
>
> - కేటీఆర్

> కులగణన సర్వేతో కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనవర్గాల గొంతు కోసింది. దీన్ని ఏ బీసీ బిడ్డా ఒప్పుకోరని అసెంబ్లీలోనే స్పష్టంచేశాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై సోమవారం నుంచి నియోజకవర్గాలవారీగా, మండలాలవారీగా, జిల్లా కేంద్రాలవారీగా భావజాల వ్యాప్తిని ప్రారంభిస్తాం. ప్రజలను జాగృతం చేస్తాం.
>
> - కేటీఆర్

### 42% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే: తలసాని

చట్టబద్ధంగా బీసీలకు 42% రిజర్వేషన్లు అమలుచేయాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని సవాల్ చేశారు. తప్పుల తడక సర్వేను తిరిగి సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో తెలంగాణ రాష్ట్ర జనాభా 3,68,76,544 ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన కులగణన సర్వేలో 3,70,77,554 ఉన్నట్టుగా ప్రకటించిందని వివరించారు.

### బొందలు చూపించు: బండ ప్రకాశ్

పదేండ్లలో బీసీల జనాభా తగ్గినట్టుగా కాంగ్రెస్ సర్కారు చెప్తున్నదని, మనుషులను చూపించాలి లేదంటే వారి బొందలు చూపించాలని శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదని మండిపడ్డారు. ధనిక రాష్ట్రాన్ని దివాలా రాష్ట్రంగా అభివర్ణించిన రేవంత్‌రెడ్డి.. జనాభా పెరుగుదల రాష్ట్రాన్ని తగ్గిన రాష్ట్రంగా చిత్రీకరించడం తగదని హితవు పలికారు. బీసీ ప్రథమ శత్రువు కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు.

### మోదీ బీసీగా మార్చుకున్నరు: శ్రీనివాస్‌గౌడ్

ప్రధానమంత్రి మోదీ పుట్టుకతోనే ఓసీ అని, తమ వర్గాన్ని బీసీలో కలుపాలని 30 ఏండ్లు పోరాటం చేశారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గుర్తుచేశారు. చివరికి మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా అయిన తర్వాత తమ కులాన్ని బీసీవర్గంలో కలుపుకున్నారని తెలిపారు. బీసీల ఓట్లు దండుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ వివిధ రూపాల్లో ప్రజల్లోకి వస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు వెన్నుదన్నుగా నిలిచింది బీసీలేనని చెప్పారు. కేసీఆర్‌కు బీసీలంటే ప్రేమ ఎక్కువ అని, అందుకే పదవుల్లో బీసీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారని తెలిపారు.

### ఓట్లు మావి.. సీట్లు మీకా?: వద్దిరాజు

వెనుకబడినవర్గాల ప్రజల ఓట్లతో గెలిచి అగ్రకులాల వారు సీట్లు పొందడంపై రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్పొరేషన్ పదవులు కూడా బీసీలకు ఇవ్వరా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. జనాభా ప్రకారం రాష్ట్ర క్యాబినెట్‌లో తొమ్మిది మంత్రి పదవులు బీసీలకు రావాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్తే బీఆర్ఎస్ తరపున వచ్చి కేంద్రంపై ఒత్తిడి పెంచుదామని సూచించారు.

### రీ సర్వే చేయాలి: స్వామిగౌడ్

ఎస్సీ, ఎస్టీలతోపాటు వెనుకబడిన బీసీలకు కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని డాక్టర్ అంబేద్కర్ కోరారని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తూ వస్తున్నదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఒక్క సర్వేతో బీసీ జనాభాను తగ్గించేశారని, రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. పెరియార్, జయలలిత, ఎన్టీఆర్, కేసీఆర్ బీసీలు కాకపోయినప్పటికీ బీసీలకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు జాతీయ పార్టీలు ఏకమై ప్రాంతీయ పార్టీలను మింగేస్తున్నాయని స్వామిగౌడ్ విమర్శించారు.

### రాజ్యాంగ సవరణ సాధ్యమే

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి ఉంటే రాజ్యాంగ సవరణ సాధ్యమేనని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇద్దరూ కూర్చొని చాయ్ తాగే లోపు రాజ్యాంగ సవరణ జరుగుతుందని తెలిపారు. ఇందిరాగాంధీ జమానాలో ముల్కీ రూల్స్‌ను రద్దు చేస్తూ రాజ్యాంగ సవరణ చేయలేదా? అని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేయడానికి రాజ్యాంగ సవరణ ఎందుకు చేస్తలేరని నిలదీశారు.

### కేసీఆర్ హయాంలోనే బీసీలకు న్యాయం

కేసీఆర్ ప్రభుత్వ పాలనలోనే బీసీలకు న్యాయం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చెప్పారు. స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మిగతా పార్టీలతో పోలిస్తే బీసీలకు ఎక్కువ సీట్లు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీయేనని స్పష్టంచేశారు. కేసీఆర్ 2003లోనే బీసీ పాలసీని రూపొందించారని గుర్తుచేశారు. చట్టసభల్లో బీసీలకు 33% రిజర్వేషన్ కల్పించాలని 2014లోనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని చెప్పారు. తెలంగాణభవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ బీసీ నేతల సమావేశం ఆ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధ్యక్షత నిర్వహించారు. సమావేశంలో శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, జోగు రామన్న, పొన్నాల లక్ష్మయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానందగౌడ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్దన్, నోముల భగత్, కోరుకంటి చందర్, నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, తుల ఉమ, రవీందర్‌సింగ్, ఆంజనేయగౌడ్, రాకేశ్, కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఈ రోజు ఒక ప్రత్యేకమైన పరిస్థితుల్లో సమావేశమయ్యామని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయం, కేసీఆర్ హయాంలో జరిగిన న్యాయం, ఇచ్చిన ప్రాధాన్యం గురించి చర్చించుకోవాల్సిన ఉన్నదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ఏమిచేయాలో 2003లోనే ప్రొఫెసర్ జయశంకర్‌తో కలిసి కేసీఆర్ బీసీ పాలసీని రూపొందించారని చెప్పారు. ఆ పాలసీలపై ప్రజల్లో వ్యాప్తి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 10 రోజుల్లోనే అసెంబ్లీలో కేసీఆర్ నేతృత్వంలో బీసీల కోసం రెండు తీర్మానాలు ప్రవేశపెట్టినట్టు గుర్తుచేశారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, దేశంలోని చట్టసభల్లో బీసీలకు 33% రిజర్వేషన్ కల్పించాలని తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించినట్టు చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో 5% నిధులు బీసీలకు కేటాయించాలని తీర్మానించినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా కులగణన చేట్టాలని 2021 అక్టోబర్ 8న అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినట్టు తెలిపారు.

---

# ఫీజు రాయితీకి బడుగులు దూరం!


**బీసీ విద్యార్థులకు సర్కారు మోసం • రాష్ట్రీయ ప్రవేశ పరీక్షల్లో వర్తింపు కరువు**

**ఓసీ, జనరల్ విద్యార్థులతో సమానంగా ఫీజు • జేఈఈ, నీట్‌లో ఓబీసీలకు రాయితీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ఉన్నత చదువుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షల ప్రక్రియలో బీసీ విద్యార్థులకు నిరాశే మిగులుతున్నది. రాష్ట్రంలో పలు ప్రవేశ పరీక్షల దరఖాస్తు ఫీజుల్లో బీసీ విద్యార్థులకు రాయితీ కరువైంది. ఎప్‌సెట్, ఐసెట్, ఎడ్‌సెట్ సహా మొత్తం ఏడు ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర ప్రభుత్వం రాయితీని అమలు చేయటం లేదు. దీంతో బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు జనరల్ క్యాటగిరి విద్యార్థులతో సమానంగా ఫీజులు చెల్లించాల్సి వస్తున్నది. మరోవైపు జాతీయంగా నిర్వహించే జేఈఈ మెయిన్, నీట్ పరీక్షల్లో ఓబీసీ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పిస్తున్నారు. జేఈఈలో జనరల్ విద్యార్థులకు ఫీజు 1000 రూపాయలు ఉంటే, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి రూ. 900 వసూలు చేస్తున్నారు. నీట్ (యూజీ)లో జనరల్ విద్యార్థులకు 1700 రూపాయల ఫీజు ఉండగా, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 1,600 రూపా యలు తీసుకుంటున్నారు. జాతీయ స్థాయి పరీక్షల్లో రాయితీ కల్పిస్తుండగా, రాష్ట్రంలో మాత్రం రాయితీలు ఇవ్వకపోవడంపై విద్యార్థులు మండిపడుతున్నారు. ఈ నెలలోనే వివిధ పోటీ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్లు విడుదల కానుండటంతోపాటు వాటికి దరఖాస్తుల స్వీకరణ సైతం ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో బీసీ విద్యార్థులకు దరఖాస్తుల్లో ఫీజు రాయితీ కల్పించాలని వివిధ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**ప్రవేశ పరీక్షల్లో ఫీజులిలా..**

| | |
|---|---|
| ఎప్‌సెట్ | ఎస్సీ, ఎస్టీలకు రూ. 500, బీసీ, జనరల్ క్యాటగిరీలకు రూ.900 |
| | రెండు పేపర్లు రాసే ఎస్సీ, ఎస్టీలకు రూ.1,000, బీసీ, జనరల్ క్యాటగిరీలకు రూ.1,800 |
| ఈసెట్ | ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులకు రూ. 500 |
| | జనరల్, బీసీ విద్యార్థులకు రూ. 900 |
| ఐసెట్ | ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులకు రూ. 550 |
| | జనరల్, బీసీ విద్యార్థులకు రూ.750 |
| లాసెట్ | ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులకు రూ.600 |
| | జనరల్, బీసీ విద్యార్థులకు రూ.900 |
| పీజీ లాసెట్ | జనరల్, బీసీ విద్యార్థులకు రూ.1,200 |
| | ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.1,000 |



---



గిర్నితండా వద్ద దీక్షలో గాంధీనాయక్

### కొనసాగుతున్న గాంధీనాయక్ దీక్ష

కొడకండ్ల, ఫిబ్రవరి 9 : జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాలో జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ మోహన్ గాంధీనాయక్ చేపట్టిన దీక్ష ఆదివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గాంధీనాయక్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తేసేవరకు పోరాటం చేస్తానని చెప్పారు. గాంధీనాయక్ దీక్షకు వివిధ పార్టీలు, కుల సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

### మాదిగలకు 15శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

**సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లను 17శాతానికి పెంచి మాదిగలకు 15శాతం కోటా ఇవ్వాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సూర్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ 30ఏండ్ల పోరాట ఫలితంగానే మాదిగలు, మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వం నేతకాని వర్గీయుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని సవరించాలని కోరారు.

---

# సర్వేను సవరించాలి

- ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలి
- కులాలవారీ వివరాలు వెల్లడించాలి
- జనాభా మేరకు నిధుల వాటా కావాలి
- బీసీలకు 42% కోటా ఇవ్వాల్సిందే
- పార్టీపరంగా రిజర్వేషన్లు అసాధ్యం
- కేసీఆర్‌తోనే మేదరులకు న్యాయం

**'నమస్తే తెలంగాణ'తో మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శీనివాస్**



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తేతెలంగాణ): 'కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేతో బడుగు, బలహీనవర్గాలకు ఒరిగేదేమీలేదని, ఇందులోని లెక్కలను చూస్తుంటే అశాస్త్రీయంగా సర్వే చేసినట్టు అర్థమవుతున్నదని తెలంగాణ మహేంద్ర (మేదరి) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోర్రిగల శ్రీనివాస్ పేర్కొన్నారు. కులాలవారీగా వివరాలు ఇవ్వకపోవడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కులగణన సర్వేను సవరించాలని, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% కోటా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. పార్టీపరంగా రిజర్వేషన్లు ఇవ్వడం అంటే మోసం చేసినట్టేనని తేల్చిచెప్పారు. చట్టం చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేలోని లోపాలు, సరిదిద్దకుంటే ఎదురయ్యే పరిణామాలు, బీసీల విషయంలో సర్కారు అనుసరిస్తున్న నిర్లిప్తవైఖరిని గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎండగట్టారు.

**ప్రభుత్వానికి కులగణనపై మీరిచ్చే సలహాలు, సూచనలేమిటి?**

కాంగ్రెస్ ప్రభుత్వం తూతూమంత్రంగా కులగణన చేపట్టింది. జిల్లాలు, కులాలవారీగా వివరాలు ఇవ్వలేదు. సర్కారుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా సర్వేను సవరించాలి. మిగిలిపోయిన 16 లక్షల మంది వివరాలను సేకరించాలి. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి.

**నమస్తే తెలంగాణ: ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కులగణన సర్వేతో బీసీలకు ఎంతమేరకు మేలు జరుగుతుంది?**

**శ్రీనివాస్:** కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపడతామని ప్రకటించిన తర్వాత ఎంతో సంతోషపడ్డం. మేదరి కులంతోపాటు బీసీలందరి లెక్కలు తేల్చి జనాభాకు అనుగుణంగా నిధులిస్తుందని సంబురపడ్డం. కానీ, కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా హడావుడిగా సర్వేచేసి తేల్చిందేమీలేదు. కులాలవారీగా లెక్కలు లేకపోవడంతో కలిగే ప్రయోజనమేమీ ఉండదు. కేవలం బీసీలందరీ వివరాలు ఇవ్వడం వల్ల ఒనగూరేదేమీ ఉండదు. కులాలవారీగా జనాభాను ప్రకటించి అందుకనుగుణంగా నిధులు కేటాయించాలి.

**సర్వే తప్పుల తడకగా జరిగిందని, బీసీల జనాభాను తగ్గించి చూపారని బీసీ సంఘాల నేతలు, రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయి. మీరు వారితో ఏకీభవిస్తారా?**

వంద శాతం ఏకీభవిస్తున్నా. సర్వేలో బలహీనవర్గాల జనాభాను తగ్గించి చూపారు. 2011 జనాభా లెక్కలు, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చిచూస్తే ఇట్టే అర్థమవుతుంది. దాదాపు 6% అంటే 20 లక్షల జనాభాను తగ్గించి చూపారు. ఎస్సీ, మైనార్టీల సంఖ్యను కూడా తగ్గించారు. విచిత్రంగా అగ్రవర్ణాల జనాభా పెరిగినట్టు చూపారు. ఇందులో ఏదో మతలబు ఉన్నది. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం ఈ విధంగా చేసిందని భావిస్తున్నాం.

**స్థానిక ఎన్నికల్లో బీసీలకు పార్టీపరంగా 42% రిజర్వేషన్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిని మీరు సమర్థిస్తారా?**

కాంగ్రెస్‌కు బీసీలంటే మొదటినుంచీ చులకనభావం ఉన్నది. కానీ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లతోపాటు అనేక హామీలిచ్చింది. వీటిని మాలాంటి బీసీ సంఘాల నాయకులతోపాటు అనేకమంది కొంతమేర విశ్వసించినం. ఇప్పుడు బీసీలకు ప్రత్యేక కోటా సాధ్యం కాదని ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా చెప్పడం విడ్డూరం. పార్టీపరంగా స్థానిక ఎన్నికల్లో బలహీనవర్గాలకు 42% సీట్లు ఇస్తామని ప్రకటించడం హాస్యాస్పదం. ఇదీ సాధ్యమయ్యే పనికాదు. హామీ ఇచ్చింది కాంగ్రెస్ అయితే ప్రతిపక్షాలు కూడా 42% కోటా ఇవ్వాలని ఎలా చెప్తారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే చట్టసవరణ చేసి వర్తింపజేయాలి. ప్రభుత్వ వైఖరిని చూస్తుంటే మోసం చేసినట్టు తేటతెల్లమవుతున్నది.

**కాంగ్రెస్ ఏడాది పాలనలో బీసీలకు ఎంతమేర మేలు జరిగింది?**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు ఏమాత్రం మేలు జరగలేదు. సమస్యలు పరిష్కరించాలని ఎన్నోసార్లు మంత్రులకు, అధికారులకు విన్నవించినం. బీఆర్ఎస్ హయాంలో మహేంద్ర సంఘ ఆత్మగౌరవ భవనానికి ఉప్పల్ భగాయత్‌లో కేటాయించిన ఎకరం స్థలంలో భవన నిర్మాణానికి నిధులు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినం. ఖజానాలో నగదు లేదని తప్పించుకుంటున్నారే తప్ప స్పష్టమైన హామీ ఇవ్వడంలేదు. కాంగ్రెస్ సర్కారు భవిష్యత్‌లో కూడా ఏమీ చేయదని తెలిసిపోతున్నది.

**కేసీఆర్ పదేండ్ల పాలనలో మేదరులకు ఏమైనా న్యాయం జరిగిందా?**

తెలంగాణ వచ్చిన తర్వాతే బీసీ ఏ క్యాటగిరీలోని మేదరులకు మేలు జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మా అభివృద్ధికి బాటలు వేశారు. ఆత్మగౌరవ భవనానికి ఉప్పల్ భగాయత్‌లో అత్యంత విలువైన ఎకరం స్థలమిచ్చారు. వెదురు సొసైటీల బకాయిలను రద్దుచేశారు. సుమారు 7,000 మందికి బీసీబంధు కింద రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం చేశారు. వెదురు డిపోల ద్వారా కలప సరఫరాను సులభతరం చేశారు. ఇలా చెప్పుకుంటూపోతే చాలా ఉన్నాయి.